# ఈ అప్పుల అభివృద్ధి ఇంకొద్దు రెడ్డో...



ADB Go to Hell అని నినదిస్తూ 2000 సం॥లో థాయ్‌లాండ్‌లో జరిగిన నిరసన ప్రదర్శన.

ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎ.డి.బి) అత్యున్నత మండలి అయిన గవర్నర్ల 39వ వార్షిక సమావేశం మే నెల 3-6 తేదీలలో హైదరాబాద్‌లో జరగనుంది. ఆ సందర్భంగా ఎ.డి.బి. గురించి, దాని అజెండాతో ప్రజల మనుగడ హక్కులకు వస్తున్న, రాగల ప్రమాదాన్ని గురించి తెలియజేయడం మా కర్తవ్యం అని మేము భావిస్తున్నాం.

ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్ ఎ.డి.బి. నుంచి పెద్దగా అప్పులు తీసుకోలేదు. మనం ప్రధానంగా ప్రపంచ బ్యాంకు బకాయిదార్లం. అయినప్పుడు ఎ.డి.బి. గురించి మనకెందుకు అనుకోకండి. మనం దీని గురించి తెలుసుకోవడానికి మూడు కారణాలున్నాయి. ఒకటి, ఎ.డి.బికీ ప్రపంచబ్యాంకుకూ అజెండాలోనూ ఆలోచనా రీతిలోనూ పెద్దగా తేడాలేదు. రెండు, మనం కాకున్నా మన దేశంలోని అనేక ఇతర రాష్ట్రాలు ఎ.డి.బి.కి 'రుణపడి' ఉన్నాయి. వాటిలో మన పొరుగు రాష్ట్రం అయిన కర్ణాటక ఒకటి. మూడు, ఎడిబితో మనకు ఇప్పటిదాకా పెద్దగా లావాదేవీలు లేకున్నా, మన రాష్ట్ర ప్రభుత్వం పిలిచి మరీ వారి వార్షిక సమావేశానికి హైదరాబాద్‌ను అప్పగించిందంటే ఇకమీదట వారికి సహితం రుణపడే ఆలోచన మన పాలకులకు ఉందన్నట్టే.

ప్రపంచ బ్యాంకు లాగే ఎ.డి.బిలో కూడా వాటాదార్లు వ్యక్తులు కాదు, ప్రభుత్వాలు. పేరులో 'ఏషియన్' అని ఉన్నప్పటికీ ఎ.డి.బి. వాటాదార్లు కేవలం ఆసియా దేశాల ప్రభుత్వాలు కావు. అమెరికాకూ, ఇతర పాశ్చాత్య దేశాలకూ కూడా ఎ.డి.బి.లో వాటా వుంది. జపాన్ తరువాత అమెరికాదే పెద్దవాటా. వాటా ఉన్న (సభ్యదేశాల) ప్రభుత్వాలలోని ఆర్థిక లేక వాణిజ్యశాఖల మంత్రులు ఎ.డి.బి. బోర్డ్ ఆఫ్ గవర్నర్లుగా ఉంటారు. ఈ దఫా దాని ఛైర్మన్ మన చిదంబరంగారే.

అన్ని బ్యాంకుల లాగే ఎ.డి.బి. కూడా అప్పులిస్తుంది, వడ్డీతో సహా వసూలు చేసుకుంటుంది. ప్రపంచ బ్యాంకయినా అంతే. వాటి కథ ఇంతే అయితే వాటి గురించి ఇంత ఆందోళన అక్కరలేదు, వాటిపట్ల ఇంత వ్యతిరేకత అక్కరలేదు. వడ్డీ చెల్లించగలమనుకున్న ప్రభుత్వాలు అప్పు తీసుకుంటాయి, లేదనుకున్నవి మానుకుంటాయి. కానీ ఈ బ్యాంకులు అప్పులిచ్చే క్రమంలో దేశాల విధాన నిర్ణయాల మీద బలమైన ఒత్తిళ్ళు పెడతాయి. ఆ నిర్ణయాలను ప్రస్తుతం అంతర్జాతీయంగా రాజ్యమేలుతున్న 'నయా ఉదారవాద' నమూనాలో తిరగరాయడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తాయి. అదే వాటి అసలు అజెండా - వడ్డీ వ్యాపారం కాదు.

'నయా ఉదారవాద' విధానాలు మంచివి కావనుకుంటే ఎ.డి.బి. నుంచి అప్పు తీసుకోకుండా ఉండవచ్చు కదా - తీసుకోవడం ఎందుకు, ఆ ఒత్తిళ్ళు కొనితెచ్చుకోవడం ఎందుకు అంటారేమో. కానీ మన పాలకులకు కూడా ఈ 'నయా-ఉదారవాద' ఆలోచనా రీతి నచ్చుతోంది. అదే సరయిన విధానమని మన చిదంబరాలూ మన్‌మోహన్‌లూ అనుకుంటున్నారు. కాబట్టి ఆ 'ఒత్తిడి'తోబాటు వచ్చే అప్పులు వారికి చేదు కాదు - ప్రజలు అడ్డం రాకుంటే.

**ఇంతకూ ఎ.డి.బి. అప్పులివ్వడం ద్వారా అమలు చేయించాలని చూసే అభివృద్ధి విధానం ఏమిటి?**

1. *వేగవంతమైన ఆర్థిక పెరుగుదలే అభివృద్ధికి మార్గం. అన్ని వనరులనూ దానికి, దాని అనుబంధమైన చర్యలకు మాత్రమే కేటాయించాలి. అక్షరాస్యత పెంపుదల అనీ, ఆరోగ్య ప్రమాణాల మెరుగుదల అనీ, సామాజిక అసమానతల తగ్గుదల అనీ, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి అనీ విడివిడిగా వనరుల కేటాయింపు చేసుకుంటూ పోతే ఆర్థిక పెరుగుదల కుంటుపడుతుంది. అభివృద్ధి రాదు. ఆర్థిక పెరుగుదల వేగంగా వస్తే ఇవన్నీ తరువాత వస్తాయి. (రాకపోయినా ఫరవాలేదు).*
2. *వనరులను సరయిన రీతిలో కేటాయించడానికి ప్రభుత్వ నిర్ణయాలకంటే మార్కెట్ శక్తులే ఉచితమైనవి. వేగవంతమైన పెరుగుదల రేటు*

ఈ బ్యాంకులు అప్పులిచ్చే క్రమంలో దేశాల విధాన నిర్ణయాల మీద బలమైన ఒత్తిళ్ళు పెడతాయి. ఆ నిర్ణయాలను ప్రస్తుతం అంతర్జాతీయంగా రాజ్యమేలుతున్న 'నయా ఉదారవాద' నమూనాలో తిరగరాయడానికి శతవిధాలా ప్రయత్నం చేస్తాయి. అదే వాటి అసలు అజెండా - వడ్డీ వ్యాపారం కాదు.

సాధించడానికి ప్రభుత్వం చొరవకంటే ప్రైవేటు పెట్టుబడే ఉత్తమమయినది. పెట్టుబడి మీద, మార్కెట్ల మీద ఆంక్షలు తొలగించి స్వేచ్ఛగా విస్తరించ నివ్వాలి. ప్రభుత్వం ఆర్థిక రంగం నుంచి పక్కకు తప్పుకోవాలి.

3. ప్రభుత్వం తాను సహితం తగుదునమ్మా అని ఆర్థిక రంగంలోకి దిగకుండా, ఆర్థిక పెరుగుదల సాధించడానికి ప్రైవేటు పెట్టుబడికి అనుకూల వాతావరణం కల్పించే పనిలో నిమగ్నం కావాలి. వారికి అవసరమైన భూమి, నీళ్ళు, కరెంటు, రవాణా సౌకర్యాలు మొదలయినవి అనువయినచోట, అనువయిన రూపంలో చవకగా కల్పించాలి. పాలనా విధానాలు, కార్మిక చట్టాలు మొదలయినవి ప్రైవేటు పెట్టుబడి వ్యాప్తికి ఆటంకం కాకుండా ఉండేటట్లు రూపొందించాలి.

1980ల తరువాత మూడవ ప్రపంచ దేశాలలో ఒక్కొక్క ప్రభుత్వమూ తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొనింది. అప్పులు పెరిగాయి, వడ్డీలకే ఆదాయంలో పెద్ద భాగం సరిపోతున్నది, ఆర్థిక పెరుగుదల పెద్దగా లేదు. అట్లాగని ఇతర సామాజిక ఆర్థిక లక్ష్యాలూ ఒనగూడడం లేదు.

ఇవి పరిష్కారం దొరకని సమస్యలేం కావు. అవినీతిని అదుపుచేసి, పాలనా రంగంలో క్రమశిక్షణను పెంచి, పన్నులు సమగ్రంగా వసూలుచేసి, ఖర్చులో వృధానూ, దళారుల ప్రభావాన్నీ కట్టడి చేసినట్టయితే బహుముఖమైన అభివృద్ధి లక్ష్యాన్ని పట్టాలెక్కించి ఉండవచ్చు. అయితే దీనివల్ల దెబ్బతినగల ప్రయోజనాలను కాపాడడమే ప్రధానమైన మూడవ ప్రపంచ దేశాల పాలకులు ఈ సంస్కరణలకు సిద్ధంగా లేరు. సరిగ్గా ఆ సమయంలో ప్రపంచ బ్యాంకు, ఎ.డి.బి. వంటి సంస్థలు తమ పెట్టుబడి వనరులతోనూ నయా-ఉదారవాద అభివృద్ధి సిద్ధాంతంతోనూ ముందుకొచ్చాయి.

## ఎ.డి.బి. ఏం చేస్తుంది?

ప్రాజెక్టులకు అప్పులిస్తుంది. ఆ ప్రాజెక్టుకు సంబంధించి ఏ పాలనా సంస్కరణలు, విధాన సంస్కరణలు చేపట్టాలో నిర్దేశిస్తుంది. నిర్దేశించి ఊరుకోదు, పక్కనుండి అమలుచేయిస్తుంది. దానికి అవసరమయిన సంస్థలకు రూపకల్పన చేయిస్తుంది. అప్పు మొత్తం ఒకేసారి ఇచ్చేస్తే తాను సూచించే 'సంస్కరణలు' చేపట్టకుండా ఉండే ప్రమాదం లేకపోలేదు కాబట్టి అప్పును కంతుల వారీగా ఇస్తుంది. పావలా వంతు ఇచ్చి, దానిని వినియోగించే క్రమంలో చేపట్టవలసిన సంస్కరణలు చేపట్టారని సంతృప్తి చెందినట్టయితేనే ఇంకొక పావలా వంతు ఇస్తుంది.

ఈ పాలనా సంస్కరణలు, విధాన సంస్కరణలు స్వభావరీత్యా ప్రజల హక్కులను హరించేవి కాగా, వాటి అమలును ఎ.డి.బి. పర్యవేక్షించే తీరు పూర్తిగా అప్రజాస్వామికమైనది. ఎ.డి.బి. చేపట్టే పర్యవేక్షణలో పారదర్శకత వుండదు. ఆయా దేశాల పాలనా వ్యవస్థలలో ఉండే ప్రజాస్వామ్య ప్రక్రియలకు చోటు ఉండదు. వాటిని పక్కనపెట్టి ప్రాజెక్టు అమలుకొక కమిటీ ఏర్పాటు చేయించి దానిద్వారా ఎ.డి.బి. వ్యవహరిస్తుంది. పోనీ ఈ కమిటీతోనయినా సమతుల్యంతో వ్యవహరిస్తుందా అంటే అదీ లేదు. నిర్ణయాలు వారివి, అమలు బాధ్యత వీరిది. అంతేకాక, ఆయా దేశాల స్థానిక చట్టాలకు, కోర్టులకు ఎ.డి.బి.పైన అదుపు ఉండదు. చట్టంతో – ఆమాటకొస్తే ప్రజలతోనైనా – ఏ సమస్య వచ్చినా స్థానిక ప్రభుత్వం చూసుకోవలసిందే. ఎ.డి.బిని కోర్టులకు లాగడానికి వీలులేదు. కానీ అంతిమ నిర్ణయాధికారం మాత్రం వారిదే.

కర్ణాటక ఎ.డి.బి. అప్పులు తీసుకుంటున్న రాష్ట్రాలలో ఒకటి. ప్రధానంగా తీరప్రాంత అభివృద్ధికీ, పట్టణాల అభివృద్ధికీ కర్ణాటక ఈ అప్పులు తీసుకుంటూ వుంది. ఈ అభివృద్ధి వల్ల లక్షలాది ప్రజానీకం జీవితాలు ప్రభావితం అవుతాయి. అయినప్పటికీ వాటికి సంబంధించిన సమాచారం ప్రజలకు తెలీదు. విధాన నిర్ణయాలు చేసే ఎ.డి.బి. ప్రజలతో కాదు సరికదా, స్థానిక సంస్థలతో సహితం సంభాషించదు. తాను రూపొందించే అభివృద్ధి పథకాలకోసం వివిధ సంస్థలను ఏర్పాటు చేయమని ఎ.డి.బి. ఆదేశించగా కర్ణాటక ప్రభుత్వం కె.యు.ఐ.డి.ఎఫ్.సి. (చఏ।ఈట్ఫు) అనే కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. ఆ సంస్థ ఎవరికీ జవాబుదారు కాదు. మంగుళూరు నివాసులు తమ నగరం అభివృద్ధి పేరిట అమలవుతున్న పథకం వివరాలు ఎ.డి.బి.ని కోరగా, ఎ.డి.బి. ఆ కార్పొరేషన్‌ను అడగమంది. ఆ కార్పొరేషన్‌ను అడిగితే మంగుళూరు మునిసిపల్ కార్పొరేషన్‌ను అడగమన్నారు. వారిని అడిగితే ఎ.డి.బి. నుంచి తమకు లభించిన కాగితాలు చూపించారు తప్ప దాని గురించి ఏ వివరాలూ ఇవ్వలేకపోయారు. దేశ పార్లమెంటు ఈ సంవత్సరం సమాచార హక్కు చట్టం జారీ చేయకముందే 2000 సంవత్సరంలోనే కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ సమాచార హక్కు చట్టం చేసింది. అయితే ఎ.డి.బి. దాని పరిధిలోకి రాదు. ఆ మాటకొస్తే పార్లమెంటు ఈ సంవత్సరం

జారీచేసిన చట్టం సహితం నేరుగా ప్రపంచ బ్యాంకుకు గానీ, ఎడిబికి గానీ వర్తించదు. వారినుండి ప్రభుత్వానికి లభించిన సమాచారం మాత్రమే మనం ప్రభుత్వం నుంచి పొందగలుగుతాం. వాళ్ళు ఇవ్వకపోయినా, ఇద్దరూ కలిసి దాచిపెట్టినా మనం చేయగలిగింది కొంచెమే.

అయినా సమాచారం పొందడంతో సరిపోదు. ఆ అభివృద్ధిని ప్రభావితం చేసే అవకాశం, హక్కు ప్రజలకు కావాలి. కర్ణాటకలో ఉద్యమకారులివాళ అదే ప్రశ్న అడుగుతున్నారు. పార్లమెంటు 74వ రాజ్యాంగ సవరణ చేసినప్పుడు పట్టణ అభివృద్ధికి సంబంధించిన అనేక అధికారాలు రాష్ట్ర ప్రభుత్వం చేతినుంచి తీసేసి మునిసిపాలిటీ చేతిలో పెట్టే ఆలోచన చేసింది. దానికి పూర్తిగా కార్యరూపం ఇవ్వకపోగా, ఇప్పుడు కాలచక్రాన్ని వెనక్కి తిప్పి ప్రజలకు గానీ చట్టానికి గానీ జవాబుదారు కానటువంటి ఎడిబి చేతిలో నిర్ణయాధికారం పెడుతున్నది కర్ణాటక ప్రభుత్వం.

అభివృద్ధి పథకాలు వనరుల వినియోగంపైన తీవ్ర ప్రభావం వేస్తాయి కాబట్టే వాటి రూపురేఖలు నిర్ణయించడంలో ప్రజలకు పాత్ర అవసరం. ఇవాళ్టిదాకా సాగుభూమిగా వున్న దానిని లేదా ఊరుమ్మడి భూమిగా ఉన్నదానిని ప్రాజెక్టుకు అప్పగిస్తారు. ప్రజలకు తాగునీటికి, సాగునీటికి ఉపయోగపడుతున్న నీటి వనరును ప్రాజెక్టు అవసరాలకోసం కేటాయిస్తారు. లేదా ప్రాజెక్టు నెలకొల్పడం వల్ల గానీ దానినుంచి వెలువడే కాలుష్యం వల్ల గానీ కొంత భూమి, నీరు నిరుపయోగమయిపోతాయి. వీటిలో ఏది జరిగినా ప్రజల జీవనం దెబ్బతింటుంది. ప్రాజెక్టు పరిమాణాన్ని బట్టి గణనీయంగా దెబ్బతినగలదు. అందువల్లనే 'అభివృద్ధి'కి సంబంధించిన నిర్ణయాధికారాన్ని ప్రజలకూ, దేశంలోని చట్టాలకూ, న్యాయవ్యవస్థకూ జవాబుదారు కాని ఎ.డి.బి. వంటి సంస్థల చేతిలో పెట్టడం అభ్యంతరకరం.

ఎ.డి.బి.కి ఉండే విధాన దృక్పథం కారణంగా – ఆ దృక్పథమేమిటో పైన వివరించాము – ఇది ప్రమాదకరం కూడా. ఎ.డి.బి. పెత్తనం చాలా లోతుగా నెలకొన్న తూర్పు ఆసియా దేశాలలో ఇప్పటికే దీనికి ఉదాహరణలున్నాయి. ఎ.డి.బి. పెత్తనానికి వ్యతిరేకంగా ఆందోళనలు జరుగుతున్నాయి కూడా.

మీకాంగ్ ఆరు దేశాల మీదుగా ప్రవహించే నది. ఆ దేశాలు చైనా, వియత్నాం, లావోస్, థాయిలాండ్, కంబోడియా (కంపూచియా), మయన్మార్ (బర్మా)లు. చేపల వేటకు, సరుకులు, మనుష్యుల రవాణాకు, సాగునీటికి, తాగునీటికి మీకాంగ్ నది తన పరీవాహక ప్రాంతంలో ఒక ముఖ్య వనరు. లక్షలాది ప్రజలు దానిపైన ఆధారపడి బతుకుతారు. అయితే ఇప్పుడొక దశాబ్దం పైగా మీకాంగ్ పరీవాహక ప్రాంత అభివృద్ధి ప్రణాళిక ఒకటి అమలులో వుంది. ఈ ఆరుదేశాల ప్రభుత్వాలూ ఆ ప్రాంత అభివృద్ధికి పథకాన్ని రూపొందించి ఆర్థిక సహాయం చేయమని ఎ.డి.బిని కోరాయి. ఎ.డి.బి. ఆ నది వనరుల మీద ప్రస్తుతం బతుకుతున్న ప్రజల అవసరాలనూ, హక్కులనూ పక్కనపెట్టి నది పరీవాహక ప్రాంత అభివృద్ధికోసం ఒక ప్రణాళిక తయారు చేసింది. నది మీద, దాని ఉపనదులమీద, చిన్నవీ పెద్దవీ 54 ప్రాజెక్టులు ప్రతిపాదించింది. అందులో 12 భారీ విద్యుదుత్పత్తి ప్రాజెక్టులు.

ఇవన్నీ అమలులోకి వస్తే ఆ నది నీటి ప్రస్తుత వాడకం తీవ్రంగా దెబ్బతింటుంది. ఆరు దేశాలలోని లక్షలాది ప్రజానీకం బతుకులు దెబ్బతినగలవు. విద్యుదుత్పత్తి ప్రాజెక్టుల వల్ల కూడా ఎక్కువ నష్టం ఉండగలదు గానీ నిరసన తెలిపే హక్కు నామమాత్రంగా కూడా లేని చైనా, మయన్మార్, లావోస్‌లలో వాటిని నిర్మిస్తున్నారు. అయినప్పటికీ వివిధ స్థాయిలలో ప్రజలు, సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రవాసంలో ఉన్న అసమ్మతివాదులు ఆందోళన చేస్తూనే వున్నారు. వాటిని ఖాతరు చేయకుండా ఆ ఆరు దేశాల ప్రభుత్వాలు, ఎ.డి.బి. తమ ప్రణాళికను అమలు చేసుకుంటూ పోతున్నాయి.

కంబోడియా (కంపూచియా)లోని చాంగ్‌నియాస్ వద్దనున్న తోన్లెసాప్ చెరువు ఆగ్నేయాసియాలోని అతిపెద్ద మంచినీటి సరస్సు. ఎండాకాలంలో దాని విస్తీర్ణం 3 లక్షల హెక్టార్లు కాగా వర్షాకాలంలో 16 లక్షల హెక్టార్ల దాకా వుంటుంది. నీళ్లు తగ్గినప్పుడు మిగిలిన భూమి సారవంతమయిన మట్టి కలిగి వుంటుంది కాబట్టి పుష్కలంగా పంటలు పండిస్తారు. ఆ భూమిలో రకరకాల వృక్ష జాతుల వనాలూ వున్నాయి. ఈ సరస్సులో చేపల వేట ఎంత ముఖ్యమంటే, కంబోడియా దేశ ప్రజలు మాంసాహారం ద్వారా పొందే పోషక పదార్థాలలో సగంపైగా ఈ చెరువు చేపలనుండే వస్తుందని అంచనా.

దాదాపు 12 లక్షల జనాభా ఈ సరస్సులో చేపలు పడుతూ, నీళ్ళు తక్కువగా వున్న కాలంలో సరస్సు వరద భూమిలో సేద్యం చేస్తూ, అందులోని వనాల ఫలాన్ని సేకరించి అమ్ముతూ ప్రత్యక్షంగా పరోక్షంగా దానిపైన ఆధారపడి బతుకుతారని అంచనా. కొన్నివేల కుటుంబాలు సరస్సులోనే పడవలలో

**ఈ పాలనా సంస్కరణలు, విధాన సంస్కరణలు స్వభావరీత్యా ప్రజల హక్కులను హరించేవి కాగా, వాటి అమలును ఎ.డి.బి. పర్యవేక్షించే తీరు పూర్తిగా అప్రజాస్వామికమైనది. ఎ.డి.బి. చేపట్టే పర్యవేక్షణలో పారదర్శకత వుండదు. ఆయా దేశాల పాలనా వ్యవస్థలలో ఉండే ప్రజాస్వామ్య ప్రక్రియలకు చోటు ఉండదు.**

# ఈ అప్పుల అభివృద్ధి ఇంకొద్దు రెడ్డో...



అభివృద్ధి పథకాలు
వనరుల వినియోగంపైన
తీవ్ర ప్రభావం వేస్తాయి
కాబట్టే వాటి రూపురేఖలు
నిర్ణయించడంలో
ప్రజలకు పాత్ర అవసరం.
ఇవాళ్టిదాకా
సాగుభూమిగా వున్న
దానిని లేదా ఊరుమ్మడి
భూమిగా ఉన్నదానిని
ప్రాజెక్టుకు అప్పగిస్తారు.
ప్రజలకు తాగునీటికి,
సాగునీటికి
ఉపయోగపడుతున్న నీటి
వనరును ప్రాజెక్టు
అవసరాలకోసం
కేటాయిస్తారు. లేదా
ప్రాజెక్టు నెలకొల్పడం వల్ల
గానీ దానినుంచి
వెలువడే కాలుష్యం వల్ల
గానీ కొంత భూమి, నీరు
నిరుపయోగమయి
పోతాయి. వీటిలో ఏది
జరిగినా ప్రజల జీవనం
దెబ్బతింటుంది.

సంసారం చేస్తారు. ఈ పడవల సముదాయాన్ని 'పడవ గ్రామాలు' అంటారు. అయితే కాలక్రమంలో ఈ సరస్సు కలుషితమయింది. 'పడవ గ్రామాల' నుండి, చుట్టుపక్కలనున్న గ్రామాల నుండి వచ్చే మానవ కాలుష్యం దీనికి ఒక కారణం. దానితోబాటు సరస్సు వరద భూమిలోని వనాలు అతి వినియోగం వల్ల వట్టిపోయే స్థితికి చేరుకున్నాయి.

తోన్లెసాప్ సరస్సు పునరుద్ధరించే ప్రయత్నాన్ని చేపట్టిన కంబోడియా ప్రభుత్వం ఎ.డి.బి.ని అప్పు కోరింది. పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఎ.డి.బి. చేతిలో పెట్టింది. వారు రూపొందించిన ప్రణాళికలోని మొదటి అంశం సరస్సులోని పడవ గ్రామాలను, సరస్సును కలుషితం చేస్తున్న పరిసర ఆవాసాలను అక్కడినుంచి తొలగించి వేరేచోట పునరావాసం కల్పించడం. ఇది అనివార్యమనే అనుకున్నా, ఆ సరస్సే వారి జీవనాధారం కాబట్టి తిరిగి చేపలు పట్టుకోవడానికీ వరద భూములలో సాగుమీద, వృక్షసంపద మీద ఆధారపడి బతకడానికీ వారికి వసతి కల్పించి, అదే సమయంలో సరస్సు జీవావరణం దెబ్బతినకుండా ఉండే నియమాలను, వ్యవస్థను రూపొందించి ఉంటే ఉచితంగా ఉండేది. దాని బదులు ఎ.డి.బి. ఏం ప్రతిపాదించిందంటే వీరందరినీ తొలగించి, సరస్సు ఒడ్డున పెద్ద పడవల రేవు నిర్మించాలని. ఓడరేవు కడితే ఏం వస్తుంది? మరపడవలు, పెద్ద పడవలు వస్తాయి. చేపల వేట సరస్సులో భారీగా జరుగుతుంది. అంటే 'అభివృద్ధి' వస్తుంది. ఇప్పటిదాకా ఆ సరస్సులో చేపలు పడుతున్న స్థానిక ప్రజలు తాము తినడంకోసం, చిన్నస్థాయిలో వ్యాపారం చేసుకోవడంకోసం మాత్రమే చేపల వేట చేపడుతున్నారు. దానిని కొనసాగించడం 'అభివృద్ధి'కి తోడ్పడదు. మరి పెద్ద రేవు వస్తే డీజల్ కాలుష్యం రాదా? ఇప్పుడు తొలగించిన తీరప్రాంత ఆవాసాల స్థానంలో పెరగబోయే వర్తకానికి అనుబంధంగా షాపులు, హోటళ్లు, మెకానిక్ షెడ్లు, కొత్త నివాసాలు రావా? అసలు మొదలుపెట్టింది కాలుష్య నివారణ కోసమయితే దాని సంగతి విడిచిపెట్టి సరస్సును 'అభివృద్ధి'కి వనరును చేసి ఇప్పటిదాకా దానిపైన ఆధారపడి బతుకుతున్న లక్షలాది ప్రజల జీవనాన్ని ప్రశ్నార్థకం చేసింది ఎ.డి.బి. వారిలో కొందరు కొత్తగా రాబోయే మరబోట్ల చేపల వేటలో జీవనం పొందబోతారేమో గానీ అందరికీ భరోసా లేదు. పైగా అసలు సమస్య పరిష్కారం కాదు.

దీనిని ఎ.డి.బి. చేసే 'అభివృద్ధి'కి ఒక మచ్చుతునకగా భావించవచ్చు. ఇది మనకెందుకు? వారి గవర్నర్ల సమావేశానికి మన హైదరాబాద్‌లో సదుపాయాలు కల్పించడం ఎందుకు? ప్రపంచ బ్యాంకుకు గులాంలమయింది చాలక ఎ.డి.బి.కి కూడా కావాలన్న నికృష్టపు కోరిక ఎందుకు?

28 ఏప్రిల్ 2006
హైదరాబాద్

మానవ హక్కుల వేదిక
Human Rights Forum (HRF)